క్లుప్తంగా

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్



కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ

బేతంచెర్ల: రౌడీ షీటర్లు నేరాలకు దూరంగా ఉండి శాంతియుత జీవితాన్ని గడపాలని సీఐ వెంకటేశ్వరరావు సూచించారు. ఆదివారం పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌లో మండలానికి చెందిన రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చెడు వ్యసనాలు, అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని, నాటుసారా, అక్రమ మద్యం, పేకాట, మట్కా నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గతంలో క్షణికావేశంలో చేసిన తప్పులను మళ్లీ పునరావృతం చేయకూడదని, చేస్తే కఠినంగా వ్యవహరిస్తామన్నారు. గ్రామ అభివృద్ధిలో భాగస్వాములై సమాజానికి మంచి చేయాలన్నారు.

రోటరీక్లబ్ నూతన కార్యవర్గం



మాట్లాడుతున్న రోటరీక్లబ్ జిల్లా గవర్నర్ కేశవరెడ్డి

కోవెలకుంట్ల: పట్టణ శివారులోని స్కందా కమ్యూనిటీ హాలులో రోటరీక్లబ్ కోవెలకుంట్ల మండల నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. క్లబ్ అధ్యక్షుడిగా కె. వెంకటరాముడు, సెక్రటరీగా సుబ్బారావు ఎన్నిక కాగా క్లబ్ జిల్లా గవర్నర్ కేశవరెడ్డి నూతన కమిటీతో ప్రమాణ స్వీకారం చేయించారు. కమిటీ సభ్యులు ఏడాది పాటు ఆయా పదవుల్లో కొనసాగుతారు. కార్యక్రమంలో రోటరీక్లబ్ నాయకులు హరీష్‌బాబు, డాక్టర్ రవికుమార్, సూర్యనారాయణరెడ్డి, శ్రీనివాసులు, వెంకటేశ్వర్‌రెడ్డి, రవీంద్రనాథరెడ్డి, బాలాంజనేయరెడ్డి, మోహనమూర్తి, అబ్దుల్ సత్తార్, శేషారెడ్డి, వెంకటసుబ్బయ్య, వీరభద్ర శివ పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్త మృతికి నివాళి



సిద్దారెడ్డి మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎంపీపీ

డోన్: పట్టణానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త సిద్దారెడ్డి (50) శనివారం సాయంత్రం గుండెపోటుతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న పార్టీ నాయకులు ఆదివారం మృతదేహానికి నివాళులర్పించారు. అండగా ఉంటామని కుటుంబ సభ్యులకు భరోసా కల్పించారు. నివాళులర్పించిన వారిలో ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి, వలంటీర్ విభాగం జిల్లా అధ్యక్షుడు పోస్టు ప్రసాద్, పార్టీ పట్టణ అధ్యక్షుడు సోమేష్ యాదవ్, మండల అధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ జాకీర్‌హుసేన్, నాయకులు ప్రతాప్‌రెడ్డి, గడ్డం సురేష్, నాగిరెడ్డి, ధారా ప్రతాప్‌రెడ్డి, కౌన్సిలర్ ఆర్ట్ రమణ, జిల్లా ఉపాధ్యక్షుడు కురుకుంద హరి, మాజీ కౌన్సిలర్ మేకల రాజు ఉన్నారు.

గంగమ్మకు సారె సమర్పణ



అమ్మవారికి సారె తీసుకొస్తున్న మహిళలు

బేతంచెర్ల: ఆషాఢ మాసం సందర్భంగా మండల పరిధిలోని సీతారామాపురం గ్రామంలో వెలసిన గంగమ్మకు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో డప్పు వాయిద్యాల నడుమ మహిళలు సారెతో ఊరేగింపుగా వెళ్లి గంగమ్మకు పుట్టింటి పట్టుచీర, సారె సమర్పించారు. పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

చెర్లోపల్లెలో చోరీ

అవుకు: మండల పరిధిలోని చెర్లోపల్లె గ్రామంలో ఆదివారం చోరీ జరిగింది. వివరాలు.. గ్రామానికి చెందిన సాలె వెంకటేశ్వర్లు భార్యకు చికిత్స నిమిత్తం మూడు రోజుల క్రితం నంద్యాలలోని కుమారుడి ఇంటికి వెళ్లారు. ఆదివారం ఇంటికి వచ్చి చూడగా చోరీ జరిగినట్లు గుర్తించారు. రూ.50 వేల నగదుతో పాటు బంగారు కమ్మలు, జుంకీలు, దేవుడి హుండీలోని నగదు చోరీ చేసినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఎంపీ అరెస్ట్ అప్రజాస్వామికం

కోవెలకుంట్ల: రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి అరెస్ట్ అప్రజాస్వామికమని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కర్రా హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. ఆదివారం తన స్వగృహంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మిథున్‌రెడ్డికి ప్రజానాయకుడు, వివాద రహితుడిగా పేరుందన్నారు. అక్రమ మద్యం కేసులో ఎలాంటి ఆధారాలు లేకపోయినా ఆయన్ను అరెస్ట్ చేయడం చంద్రబాబు కక్షపూరిత పాలనకు నిదర్శనమన్నారు. ప్రజల దృష్టి మళ్లించడానికే అక్రమ అరెస్టులకు ప్రభుత్వం తెగబడుతోందని ఆరోపించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై ఎన్నికేసులు పెట్టినా ప్రజల పక్షాన పోరాటం చేస్తూనే ఉంటామన్నారు.

కూటమిది అరాచక పాలన

- ప్రశ్నించిన వారిపై అక్రమ కేసులు, దౌర్జన్యాలు
- మంత్రి అండదండలతో విచ్చలవిడిగా పేకాట క్లబ్‌లు
- ఎన్నికలు ఎప్పుడొచ్చినా సిద్ధంగా ఉండాలి
- వైఎస్సార్‌సీపీ విస్తృతస్థాయి సమావేశంలో కాటసాని పిలుపు





సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, చిత్రంలో కాటసాని రామిరెడ్డి, సమావేశానికి హాజరైన పార్టీ నాయకులు, కార్యకర్తలు

కోవెలకుంట్ల: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అరాచక, అవినీతి పాలన కొనసాగిస్తోందని బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ధ్వజమెత్తారు. ఆదివారం కోవెలకుంట్ల ముదిగేడు చౌరస్తాలోని లక్ష్మి వెంకటేశ్వర ఫంక్షన్ హాలులో బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శులు కర్రా హర్షవర్ధన్‌రెడ్డి, గుండం సూర్యప్రకాష్‌రెడ్డి, తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కాటసాని మాట్లాడుతూ.. కూటమి నాయకులు అధికార యంత్రాంగాన్ని చెప్పు చేతుల్లో పెట్టుకుని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయించడంతోపాటు విచ్చలవిడిగా అవినీతికి పాల్పడుతోందని ఆరోపించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు చేయడం లేదని ప్రశ్నించిన వారిపై దౌర్జన్యాలు, అక్రమ కేసులు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మోసం అనేది చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య అన్నారు. 2024 ఎన్నికల్లో మోసపూరిత హామీలను నమ్మి గద్దెనెక్కిస్తే ప్రజలను అన్ని విధాలా మోసం చేస్తూ పాలన సాగిస్తున్నారన్నారు. ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఓటమిపాలు కావడానికి ఈవీఎంలలో అవకతవకలు జరిగాయని బలంగా విశ్వసిస్తున్నామని తెలిపారు. పోలింగ్ రోజున నమోదైన ఓట్లకు కౌంటింగ్ రోజున ప్రకటించిన ఓట్ల వివరాల్లో వ్యత్యాసం ఉందన్నారు. పోలింగ్ ఓట్లతో పోలిస్తే కౌంటింగ్ రోజున రాష్ట్రంలో 43 లక్షల ఓట్లు ఎక్కువగా ప్రకటించారన్నారు.

మంత్రి అండదండలతో పేకాట క్లబ్‌లు

రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అండదండలతో బనగానపల్లె నియోజకవర్గంలో పేకాట క్లబ్‌లు విచ్చలవిడిగా కొనసాగుతున్నాయని కాటసాని ఆరోపించారు. కోవెలకుంట్ల మండలంలోనే దాదాపు 8 పేకాట క్లబ్‌లు నడుస్తున్నాయన్నారు. పోలీసులు పేకాటక్లబ్‌లపై దాడులకు వెళితే మంత్రిగారి అనుమతితోనే క్లబ్‌లు నడుపుతున్నామని తెలుగుదేశం పార్టీ నాయకులు బహిరంగంగా చెబుతున్నారన్నారు. కుందూనది విస్తరణ పనులు చేపట్టి నదీతీర ప్రాంత రైతుల పొలాలు, గ్రామాలు నీట మునగకుండా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో కరకట్ట ఏర్పాటు చేస్తే కరకట్టను సైతం వదలకుండా తవ్వుకుని అమ్ముకుంటున్నారని మండిపడ్డారు. రాత్రివేళల్లో టీడీపీ నాయకులు మట్టి, ఇసుకను తరలిస్తున్నారని కొన్ని పత్రికలు, మీడియాలో వస్తే పగటి వేళల్లోనే తోలుకోవాలని మంత్రి బీసీ చెప్పారని కార్యకర్తలు యథేచ్ఛగా దోపిడి చేస్తున్నారన్నారు. ఉచిత ఇసుక ఇస్తామని చెప్పి టన్ను రూ. 550 విక్రయిస్తుండగా బనగానపల్లెలో అదనంగా రూ. 220 వసూలు చేస్తున్నారని తెలిపారు. నియోజకవర్గంలో రైతులకు యూరియా దొరకడం లేదని, రసాయన ఎరువులు కూడా తెప్పించలేని స్థితిలో మంత్రి ఉన్నారని మండిపడ్డారు.

గోరుకల్లు, అవుకు రిజర్వాయర్లను నింపాలి

శ్రీశైలం జలాశయం నుంచి గోరుకల్లు, అవుకు రిజర్వాయర్లను పూర్తి స్థాయిలో నింపాలని జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి అన్నారు. ఎగువ ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసి జలాశయానికి నీరు సమృద్ధిగా చేరిందన్నారు. రైతులకు సాగు నీటిని అందించలేని దుస్థితిలో కూటమి సర్కార్ ఉందన్నారు. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ సామర్థ్యాన్ని 44 వేల క్యూసెక్కులకు పెంచిన ఘనత దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డిదేనన్నారు. గత ఏడాది అన్నదాత సుఖీభవ పథకాన్ని ఇవ్వలేదని, ఈ ఏడాది ఖరీఫ్ ప్రారంభమై రెండు నెలలు కావస్తున్నా ఇప్పటి వరకు అతిగతీ లేదన్నారు. ముదిగేడు– సంజామల రోడ్డు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మంజూరైతే కూటమి ప్రభుత్వ హయాంలో మంజూరు చేసినట్లు గొప్పలు చెప్పుకుంటున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏపీ ఎన్‌జీఓ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు గువ్వల రామకృష్ణారెడ్డి, పార్టీ జిల్లా ప్రచార కార్యదర్శి సిద్దంరెడ్డి రాంమోహన్‌రెడ్డి, నాయకులు భీమిరెడ్డి ప్రతాప్‌రెడ్డి, ఎల్‌బీసీ రామసుబ్బారెడ్డి, చిక్కేపల్లి రామకృష్ణారెడ్డి, ప్రసాదరెడ్డి, ఈర్నపాటి సుబ్బరాయుడు, పోతం రాంమోహన్‌రెడ్డి, అమడాల శంకరయ్య, భాస్కర్‌రెడ్డి, వెంకటేశ్వర రెడ్డి, డీవీశేషిరెడ్డి, శేషిరెడ్డి, వెంగళరెడ్డి, మోహన్ రెడ్డి, రామిరెడ్డి, శివరామయ్య, సుబ్బనారాయణరెడ్డి, సుధాకర్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీరాముల అబ్రహం, వెంకటేశ్వర్‌రెడ్డి, నాగార్జునరెడ్డి, కరుణాకర్, భూసభాస్కర్‌రెడ్డి, రామసుబ్బారెడ్డి, సేనారెడ్డి, అక్బర్‌బాషా, దశరథ రామిరెడ్డి, రాంభూపాల్‌రెడ్డి, జశ్వంత్‌రెడ్డి, ధనికొండ నాగేశ్వరరెడ్డి, సుధాకర్‌రెడ్డి, డీసీ ఉసేన్, గోపిరెడ్డి నాగేశ్వరరెడ్డి, జనార్దన్, కిషోర్ పాల్గొన్నారు.

బాబును నమ్మితే మోసం గ్యారెంటీ!



బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీపై క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న కాటసాని, పాపిరెడ్డి

సంజామల: సుపరిపాలనలో తొలి అడుగు అంటూ కూటమి ప్రభుత్వం అక్రమ కేసుల పాలన కొనసాగిస్తోందని బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి అన్నారు. సంజామల మండలం గిద్దలూరు ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం సాయంత్రం బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీపై వైఎస్సార్‌సీపీ విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కాటసాని మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై అక్రమ కేసులను నమోదు చేస్తోందని మండిపడ్డారు. చంద్రబాబును నమ్మితే మోసం గ్యారెంటీ అని మరోసారి రుజువైందన్నారు. టీడీపీ నాయకులు ఖాళీ స్థలం కనిపిస్తే చాలు కబ్జా చేస్తున్నారని విమర్శించారు. అధికారులు కూడా వారికి వత్తాసు పలుకుతున్నారన్నారు. అక్రమ కేసులకు భయపడే పరిస్థితి లేదని తేల్చిచెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదైన సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా వైఎస్సార్‌సీపీ వెన్నుపోటు దినోత్సవాన్ని నిర్వహించడంతో కూటమి నాయకులకు వణుకు పుట్టిందని జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి అన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు కూటమి ప్రభుత్వ వైఫల్యాలను బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి గుండం సూర్య ప్రకాష్‌రెడ్డి, వైస్ ఎంపీపీ రాజశేఖర్ రెడ్డి, నాయకులు చిన్న బాబు, పోచ వెంకట రామిరెడ్డి, గౌరిగారి నాగేశ్వర్‌రెడ్డి, బత్తుల రామచంద్రారెడ్డి, బాబు, సోమసుందర్ రెడ్డి, ముచ్చలపురి దొర, నాగిరెడ్డి, సత్యమయ్య, సర్వేశ్వర్‌రెడ్డి, రహమతుల్లా, మధుసూదన్‌రెడ్డి, దేశాయ్‌రెడ్డి పాల్గొన్నారు.

హామీలు అమలు చేయాలి



మాట్లాడుతున్న వడ్డెర సంఘం జాతీయ ఆర్గనైజింగ్ కార్యదర్శి శిల్పిసుబ్బరాయుడు

బనగానపల్లె రూరల్: ఎన్నికల సమయంలో కూటమి నేతలు వడ్డెర కులస్తులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని వడ్డెర సంఘం జాతీయ ఆర్గనైజింగ్ కార్యదర్శి సుబ్బరాయుడు డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని రామకృష్ణాపురం గ్రామంలో నిర్వహించిన వడ్డెర మహాసభలో ఆయన మాట్లాడారు. వడ్డెర సొసైటీలకు 30 ఎకరాల చొప్పున మైనింగ్ లీజులు ఇవ్వడం, జేసీబీలు, బ్లాస్టింగ్ పరికరాలను సబ్సిడీతో మంజూరు చేయడం, 50 ఏళ్లు పైబడిన బీసీలందరికి ఎన్టీఆర్ భరోసా పింఛన్లు ఇవ్వడం వంటి హామీలు ఇచ్చారని గుర్తు చేశారు. ఇప్పటి వరకు ఒక్క హామీ కూడా అమలులోకి రాలేదని మండిపడ్డారు. ఇచ్చిన హామీల అమలుకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. వడ్డెరలు తమ హక్కుల సాధన కోసం ఐక్యతతో నిలవాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా కొండమీద బీసీ కాలనీ నుంచి దుర్గమ్మ కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సంపంగి మధు, మధుశేఖర్, సంపంగి నాగమద్దయ్య, రవి, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సత్యసాయిబాబా శత జయంతి వేడుకలు



సత్యసాయిబాబా దివ్య రథోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

కోవెలకుంట్ల: పట్టణంలోని సత్యసాయిబాబా ఆలయంలో స్వామివారి శత జయంతి వేడుకలను ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం అభిషేకం, అర్చనలు, తదితర పూజా కార్యక్రమాల అనంతరం ఆలయ ఆవరణలో భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం సత్యసాయి దివ్య రథోత్సవం ఆలయం నుంచి నాగులకట్ట, సంతమార్కెట్, పాండురంగస్వామి దేవాలయం, ముదిగేడు చౌరస్తా, ఆర్టీసీ బస్టాండ్ మీదుగా సాగింది. ఆయా కాలనీలకు చెందిన భక్తులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రథోత్సవంలో మహిళల కోలాటం ఆకట్టుకుంది.

ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తత అవసరం



బాలికలకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ మమత

డోన్ టౌన్: సమాజంలో ఆన్‌లైన్ మోసాలు పెరిగిపోతున్న నేపథ్యంలో ముఖ్యంగా మహిళలు, బాలికలు అప్రమత్తంగా ఉండాలని రూరల్ పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐ మమత సూచించారు. ఆదివారం స్థానిక బాలికల వసతిగృహంలో శక్తి టీం ఆధ్వర్యంలో శక్తి యాప్, పోక్సో చట్టం, సైబర్ క్రైం, డ్రగ్స్, లోన్ యాప్‌లు, రహదారి భద్రతపై విద్యార్థినులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళలపై అఘాయిత్యాలు, ఈవ్ టీజింగ్ వంటి ఘటనలు పెరుగుతున్నాయని, వాటి నుంచి రక్షణ పొందేందుకు శక్తి యాప్ లాంటి టెక్నాలజీ ఆధారిత సాధనాలను వినియోగించాలన్నారు. ఏదైనా అత్యవసర సమయంలో 110 లేదా 112 నంబర్లకు కాల్ చేస్తే తక్షణ పోలీస్ సహాయం అందుతుందని తెలిపారు.

ప్రజల నెత్తిన శఠగోపం పెట్టడమే బాబు నైజం

- ప్యాపిలిలో వైఎస్సార్‌సీపీ విస్తృత స్థాయి సమావేశం



క్యూఆర్ కోడ్ బ్రోచర్‌లను విడుదల చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ప్యాపిలి: ఎన్నికల ముందు ఆచరణ సాధ్యం కాని హామీలు గుప్పించడం..అధికారంలోకి వచ్చిన తర్వాత తనను నమ్మిన ప్రజల నెత్తిన శఠగోపం పెట్టడం చంద్రబాబు నాయుడు నైజం అని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పోదొడ్డి కృష్ణమూర్తి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి మెట్టు వెంకటేశ్వర్ రెడ్డి, ఏపీఐఐసీ మాజీ డైరెక్టర్ బోరెడ్డి పుల్లారెడ్డి అన్నారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆదివారం ఆ పార్టీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ‘బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ’ కార్యక్రమం ద్వారా చంద్రబాబు మోసాలను ప్రజలకు వివరించాలన్నారు. సూపర్‌సిక్స్ పథకాల్లో తల్లికి వందనం అమలు చేశామని గొప్పలు చెప్పుకుంటున్నారని.. అయితే క్షేత్రస్థాయిలో అర్హత ఉన్న చాలా మంది తల్లులు తమకు డబ్బులు జమకాలేదని కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారని తెలిపారు. కేవలం జిల్లాకు మాత్రమే ఉచిత బస్సు ప్రయాణం అని చెప్పడం ఎంత వరకు సమంజసమో టీడీపీ నాయకులకే తెలియాలన్నారు. ఆడబిడ్డలకు నెలకు రూ. 1500 ఇస్తామన్న హామీ ఏమైందో ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. కూటమి నేతలు డోన్ నియోజకవర్గంలో అప్పటి ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ప్రారంభించిన అభివృద్ధి పనులను పూర్తి చేసినా చాలన్నారు. అనంతరం వారు చంద్రబాబు హామీలకు సంబంధించిన వీడియోల క్యూఆర్ కోడ్, బ్రోచర్లను విడుదల చేశారు.

కూటమి నేతలది పైశాచిక ఆనందం

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వైఎస్సార్‌సీపీకి చెందిన మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలను అరెస్టు చేసి పైశాచిక ఆనందాన్ని పొందుతోందన్నారు. కేసులకు భయపడే ప్రసక్తే లేదన్నారు. 2029లో మళ్లీ వైఎస్సార్‌సీపీని అధికారంలోకి తీసుకొచ్చే వరకు కార్యకర్తలు పోరాడాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు వెంగలాంపల్లి రామచంద్రారెడ్డి, జంగం చంద్రశేఖర్, కమతం భాస్కర్ రెడ్డి, రామసుబ్బయ్య, న్యాయవాది నాగభూషణ్ రెడ్డి, రాజా మురళీకృష్ణ, శ్యాం సుందర్ రెడ్డి, బోరెడ్డి రాము, సుంకయ్య, బోరెడ్డి రఘు, సోమశేఖర్, నేరేడుచెర్ల చంద్రశేఖర్ రెడ్డి, మామిళ్లపల్లి శ్రీనివాసులు, రజనీ రెడ్డి, బషీర్, విష్ణువర్ధన్ రెడ్డి, నిజాం, పుల్లారెడ్డి, అంజి, ప్రేమసాగర్ రెడ్డి, తులసి రెడ్డి పాల్గొన్నారు.

24న చౌడేశ్వరిదేవి జయంతి వేడుకలు

కొలిమిగుండ్ల: తొగట వీర క్షత్రియుల ఆరాధ్య దైవమైన చౌడేశ్వరిదేవి జయంతి వేడుకలను ఈనెల 24న కోటపాడులోని అమ్మవారి ఆలయంలో నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఆదివారం తెలిపారు. గ్రామపెద్దలు, తొగట వీర క్షత్రియుల ఆధ్వర్యంలో తెల్లవారుజాము నుంచే అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరుగుతాయన్నారు. పూజల అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశామన్నారు.

వ్యవసాయానికి విద్యుత్ సరఫరా వేళలు

కోవెలకుంట్ల: మండలంలోని ఆయా ఫీడర్ల పరిధిలో సోమవారం నుంచి వ్యవసాయ రంగానికి పగటి వేళల్లో తొమ్మిది గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు ఆ శాఖ ఏఈ అనంతరావు తెలిపారు.

- అమడాల, గుంజలపాడు, జోళదరాశి ఫీడర్ల పరిధిలోని కోవెలకుంట్ల, భీమునిపాడు, బిజనవేముల, సొదరదిన్నె, కంపమల్ల గ్రామాలకు ఉదయం 7.30 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుంది.
- గుళ్లదూర్తి, పొట్టిపాడు, హరివరం, అల్లూరు, కొత్తపల్లె ఫీడర్ల పరిధిలో ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు..
- కలుగొట్ల, కొప్పెర్ల, రేవనూరు ఫీడర్ల పరిధిలోని గ్రామాలకు తెల్లవారుజామున 6 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ ఉంటుంది.
- సంజామల: మండలంలో వ్యవసాయానికి సోమవారం నుంచి ఉదయం 5 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందని ఇన్‌చార్జ్ ఏఈ దుర్గ శ్రీనివాస్ తెలిపారు. సంజామల, ఆకుమల్ల, పేరుసోముల, నొస్సం సబ్‌స్టేషన్‌ల పరిధిలోని ముక్కమల్ల, ఆల్వకొండ, రెడ్డిపల్లె, వసంతాపురం, కమలపూరి, ముదిగేడు, కానాల, అక్కంపల్లె, గిద్దలూరు, ఆర్.లింగందిన్నె, రామిరెడ్డిపల్లె, మిక్కినేనిపల్లె ఫీడర్ల పరిధిలోని గ్రామాలకు ఈ సమయాల్లో విద్యుత్ సరఫరా చేస్తామని పేర్కొన్నారు.

నేడు అగ్రిగోల్డ్ బాధితుల సమావేశం

డోన్ టౌన్: స్థానిక సీపీఐ కార్యాలయంలో సోమవారం అగ్రిగోల్డ్ బాధితుల సమావేశం నిర్వహిస్తున్నట్లు ఉమ్మడి కర్నూలు జిల్లా అగ్రిగోల్డ్ బాధితుల సంఘం అధ్యక్షుడు మల్లికార్జున ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సమావేశానికి సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి, అగ్రిగోల్డ్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు ముప్పాళ్ల నాగేశ్వరరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిరుపతిరావు, నంద్యాల జిల్లా కార్యదర్శి రంగనాయుడు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. బాధితుల సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారం కోసం ప్రభుత్వంతో చర్చలు, పోరాటాలకు కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. అగ్రిగోల్డ్ ఏజెంట్లు, కష్టమర్లు పాల్గొనాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో జియారత్ వేడుకలు

సంజామల: మండల పరిధిలోని ముచ్చలపురి గ్రామంలో మౌలాలి స్వామి జియారత్ వేడుకలు ఆదివారం భక్తిశ్రద్ధలతో జరిగాయి. సంజామల, ఎగ్గోని, కొత్తపేట, కానాల తదితర గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి ఫాతేహాలు సమర్పించారు. అర్ధరాత్రి తర్వాత మౌలాలిస్వామిని గ్రామంలోని ప్రతి ఇంటికి దగ్గరకు తీసుకెళ్లారు.

మోస్తరు నుంచి భారీ వర్షం

కొలిమిగుండ్ల: మండలంలో శనివారం రాత్రి మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. నందిపాడు, తిమ్మనాయునిపేట, నాగిశెట్టిపల్లె, హనుమంతుగుండం, యగ్రగుడి, కోటపాడు గ్రామాల్లో కుండపోత వాన కురిసింది. కోటపాడు–తిమ్మనాయునిపేట గ్రామాల మధ్యనున్న ప్రధాన రహదారిపై పెద్ద ఎత్తున వర్షపు నీరు ప్రవహించింది. నాగిశెట్టిపల్లె బస్టాప్ వద్ద నీరు రోడ్డుపై పారాయి. కొలిమిగుండ్ల, ఇటిక్యాల, కనకాద్రిపల్లె, అంకిరెడ్డిపల్లె తదితర గ్రామాల్లో మోస్తరు వర్షం కురవగా మరికొన్ని గ్రామాల్లో తేలిక పాటి వర్షం పడింది. 25.2 మి.మీ వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. వర్షంతో వివిధ పంటలకు తడులు అందాయి.

నారా అంటేనే నయవంచన



బాబు మోసాలపై స్కానర్ లోగోను ఆవిష్కరిస్తున్న శ్రీరాములు, వైఎస్సార్‌సీపీ నాయకులు

- మీట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ శ్రీరాములు

డోన్: టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడంటే మోసం, వెన్నుపోటు అని ప్రజలు గుర్తిస్తున్నారని రాష్ట్ర మీట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ శ్రీరాములు అన్నారు. ఆదివారం మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి నివాసంలో డోన్ మండల, పట్టణ వైఎస్సార్‌సీపీ విస్తృతస్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా శ్రీరాములు మాట్లాడుతూ.. చంద్రబాబును నమ్మిన ప్రజలు నట్టేట మునిగిపోయారని, కూటమి ప్రభుత్వ వైఫల్యాలను గ్రామస్థాయిలో ప్రజలకు వివరించాలని కార్యకర్తలకు సూచించారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని, మహిళలపై అఘాయిత్యాలు, ప్రతిపక్ష కార్యకర్తలపై దాడులు పెరిగిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. కూటమి నేతలు అవినీతికి పాల్పడుతూ గత వైఎస్సార్‌సీపీ పాలనపై దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఉచిత బస్సు ప్రయాణం, నిరుద్యోగ భృతి, రైతుబంధు, ప్రతి ఆడపిల్లకు రూ.1,500, కొత్త పింఛన్లు వంటి ‘సూపర్ సిక్స్’ హామీల అమల్లో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు.

జగనంటే నమ్మకం

మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన శాంతి, స్థిరత్వం, అభివృద్ధి, సంక్షేమానికి ప్రతీకగా నిలిచిందని శ్రీరాములు ప్రశంసించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో పాటు కులం, మతం, పార్టీ భేదం లేకుండా అన్ని వర్గాల్లో అర్హులైన పేద, మధ్య తరగతి ప్రజలకు సంక్షేమం అందించారని తెలిపారు. ఇలాంటి నేతను ఓడించుకున్నామనే బాధ ప్రజల్లో ఉందన్నారు. కూటమి అరాచకాలను కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. అనంతరం ‘బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ’ అనే స్కానర్ లోగోను ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి, జెడ్పీటీసీ బద్దల రాజ్‌కుమార్, పార్టీ వలంటీర్ విభాగం జిల్లా అధ్యక్షుడు పోస్టు ప్రసాద్, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ మల్లెంపల్లె రామచంద్రుడు, వైస్ ఎంపీపీ ఎర్రిస్వామి, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ ఓబులాపురం మదన్, పార్టీ మండల అధ్యక్షుడు సోమేష్ యాదవ్‌తో కలిసి ఆవిష్కరించారు. పార్టీ నాయకులు నాగభూషణం రెడ్డి, మల్యాల భాస్కర్‌రెడ్డి, చిరంజీవి, కురుకుంద హరి, మున్సిపల్ వైస్‌చైర్మన్ జాకీర్ హుసేన్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

కూటమి మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్దాం

- బేతంచెర్ల విస్తృతస్థాయి సమావేశంలో ఎంపీపీ, నగర పంచాయతీ చైర్మన్



బేతంచెర్లలో బాబు మోసాలపై క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపీపీ, నగర పంచాయతీ చైర్మన్, నాయకులు

బేతంచెర్ల: ఎన్నికల సమయంలో అలవికాని హామీలతో ప్రజలను మభ్యపెట్టి, అధికారంలోకి వచ్చాక మోసం చేయడం చంద్రబాబునాయుడి నైజమని వైఎస్సార్‌సీపీ నేతలు విమర్శించారు. ఆదివారం బేతంచెర్ల పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ‘బాబు షూరిటీ – మోసం గ్యారంటీ’ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి, గిడ్డంగులశాఖ మాజీ డైరెక్టర్ మూర్తుజావలి, ఉర్దూ అకాడమీ మాజీ డైరెక్టర్ బాబుల్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రామచంద్రుడు, జిల్లా ప్రతినిధి మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు. చంద్రబాబు ఇచ్చిన 145 హామీల్లో ఒక్కదాన్ని కూడా నెరవేర్చలేదని, ప్రజలను మోసం చేశారని ధ్వజమెత్తారు.

జగన్ హామీలన్నీ నెరవేర్చారు

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన వెంటనే ఇచ్చిన హామీలను నెరవేర్చారని గుర్తు చేశారు. చర్చిల నిర్మాణం, పాస్టర్లకు గౌరవ వేతనాలు అందించారని, అయితే కూటమి ప్రభుత్వం ఆ వర్గంపై నిర్లక్ష్యం చూపుతోందని పార్టీ క్రిస్టియన్ మైనారిటీ మండల అధ్యక్షుడు తిమోతి తెలిపారు. పైగా పాస్టర్లపై దాడులు జరుగుతున్నాయన్నారు.

క్యూఆర్ కోడ్ ద్వారా బాబు మోసాలు

చంద్రబాబు మోసాలను ప్రజలకు తెలియజేసే సంకల్పంతో క్యూఆర్ కోడ్ సిస్టమ్ ప్రవేశపెట్టినట్లు వైఎస్సార్‌సీపీ నాయకులు తెలిపారు. గ్రామాల్లో ఆ కోడ్‌ను స్కాన్ చేస్తే బాబు ప్రభుత్వం చేసిన మోసాలు ప్రజలకు తెలుస్తాయన్నారు. అనంతరం క్యూఆర్ కోడ్ స్కాన్ పత్రాలను ఆవిష్కరించారు. గత ఐదేళ్లలో బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి సారథ్యంలో జరిగిన అభివృద్ధిని ప్రజలకు వివరించాల్సిన అవసరం ఉందని నేతలు సూచించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రంగస్వామి, పార్టీ పట్టణ, మండల కన్వీనర్లు తిరుమలేశ్వర్‌రెడ్డి, పిట్టల జాకీర్, కౌన్సిలర్లు చింతల నాగిరెడ్డి, కోట్ల మధు, నాయకులు లక్ష్మి రెడ్డి, రుద్రవరం నారాయణ, శేఖరయ్య, జయప్రకాశ్ రెడ్డి, దస్తగిరి, ఖాజా, సలీం, వలి, భాస్కర్, నాగేశ్వరరావు, నద్ది శ్రీను, మద్దిలేటి, రమేష్ రెడ్డి, నిరంజన్, కీర్తి, అమ్మని, వెంకటలక్ష్మి, మురళీధర్ రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, గూని నాగరాజు, సర్పంచ్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.